# శ్రీ నిత్యానందస్వామి, శ్రీ ప్రకాశానందస్వామి వార్లమధ్య జరిగిన

# వార్తాలాపము.

## ప్రథమ ప్రసంగము.

నేటికి నలువదిరెండుసంవత్సరముల పూర్వమున శ్రీనిత్యానంద స్వామివారు రాజకోటలో నుండెడివారు. వారు తనభక్తులతో ప్రకాశానందస్వామివారు ఈపరిసరములనుండి వెళ్ళుచున్నచో వారిని తమ వద్దకు తీసికొని రమ్మని చెప్పిరి. ఒకనాడు ప్రకాశానందస్వామివారు 'నడియాదు' నుండి 'గోండలు' వేంచేయుచుండిరి. రాజకోటస్టేషనునందు నిత్యానందస్వామివారి భక్తుడు 'వాఘజీభాఈ' అను నతడు ప్రకాశానందస్వామివారిని జూచి "శ్రీనిత్యానందస్వామివారు తమదర్శనమునకెంతయో ఆతురపడుచున్నారు. దయయుంచి వారికడకు ఒకసారి వేంచేయుడు" అని మనవిచేసెను. వారికోర్కెను మన్నించి ప్రకాశానందస్వామివారు వెళ్లిరి. శ్రీనిత్యానందస్వామివారు వారినిజూచి అపరిమితానందమును చెందిరి.

ఆరోజు మధ్యాహ్నము కొద్దిమంది భక్తులసమూహము వారి వద్దసత్సంగమునకు వచ్చెను. ఒకభక్తుడు "శ్రీప్రకాశానందస్వామివారు ఏమయినా ఉపదేశించరా" అని పలికెను. అదివిని నిత్యానందస్వామివారు ప్రకాశానందస్వామివారితో నిట్లు పలికిరి—"వీరు తీక్ష్ణబుద్ధి వినదలచియున్నారు. కొంచెము లాభము కలుగజేయుడు"

## ఉపదేశమునిచ్చు అధికారము.

స్వా॥ ప్ర॥ :—నేను ఇతరులగూర్చిఉపదేశించుటకు తగిన వాడను కాను. నామనస్సుకు ఎన్నోసార్లు ఉపదేశము చేసియుంటిని. ఇంతవరకు నామనస్సు ఆప్రకారము నడచుకొనలేదు. అది నామాట విని ఆప్రకారము నడచుకున్న తర్వాతనే నేను పరుల కుపదేశింప నర్హుడను. కబీరుదాసు ఇట్లు చెప్పెను:—

"కబీర్ మన పరమోదలే, ఆప్ హేలే ఉపదేశ్,
జోప పాంచోం వశకరో, శిష్యహోయి సబ్ దేశ్."

ఇది విని నిత్యానందస్వామివారు నవ్వసాగిరి. మరియువారిట్లు నుడివిరి.

## ఉపదేశములు ద్వివిధములు.

స్వా॥ ని॥ :— ఉపదేశములు రెండురకములు. మాటలతో ఉపదేశముచేయుట ఒకరకము. ఆచరణద్వారా ఉపదేశముచేయుట ఇంకొకరకము. మాటలతో మనస్సున కుపదేశము జరుగును. మనస్సు ఆప్రకారము నడుచుకున్నతర్వాత, వారి యాచరణ పరులకు ఉపదేశమగును. నేను తూగుటుయ్యేలలో నూగుచు మిమ్ములను భోగములను త్యజించుడని ఉపదేశించిన మీరు వినెదరా? నేను ఇతరులకు ఉపదేశింప దలచినప్పుడు నేను ముందుగా సమస్తభోగములను త్యజించవలెను. ఆ త్యాగము ఆచరణద్వారా ఇతరులకు ఉపదేశము కావలెను. ఉపన్యాసములద్వారా కాదు.

## ఉపన్యాసముచేయుట నిషిద్ధము.

సన్యాసికి ఉపన్యాసమిచ్చుట నిషిద్ధము: శాస్త్రమిట్లు చెప్పుచున్నది:—

*న శిష్యాననుబధ్నీత గ్రన్థాన్నైవాభ్యసేద్బహూన్ ।*
*న వ్యాఖ్యాముపయుఞ్జీత నారమ్భానారభేత్క్వచిత్ ॥*

"శిష్యులను చేరదీయరాదు. గ్రంథములను చాలావాటిని అభ్యసింపరాదు. ఉపన్యాసముల నీయరాదు. పనుల నారంభించ రాదు."

'న శిష్యాననుబధ్నీత'

సన్యాసి శిష్యులను స్వీకరించరాదు. ముముక్షువుగా జ్ఞాన ప్రాప్తికొరకు సన్యాసమును స్వీకరించి యోగాభ్యాసము చేయుచున్న సన్యాసి అభ్యాసకాలమున శిష్యులను స్వీకరించరాదు. శిష్యులను స్వీకరించు నధికారము ఆరూఢుడైన యతికి మాత్రమే కలదు. ఒక వేళ శిష్యులున్నను వారిని తనచెంత నుండనియ్యరాదు. అది ఉభయులకును అనిష్టమును కలుగజేయును. శిష్యులు చెంతనున్నచో వారిచే సేవ చేయించుకొనవలెనను దురాశ కలుగును. శాస్త్రము లిట్లు చెప్పుచున్నవి:—

*శుశ్రూషాలాభపూజార్థం యశోఽర్థం వా పరిగ్రహః।*
*శిష్యాణామనుకారుణ్యాత్ న జ్ఞేయః శిష్యసంగ్రహః॥*

"శుశ్రూష, పూజ, లేక కీర్తి—వీటికొరకుగాని, శిష్యుల యందుకరుణవలనగాని వారిని సేకరించుట శిష్యసంగ్రహము అని తెలియనగును."

**శుశ్రూషాలాభ** :— శుశ్రూషార్థము అనగా తనకు సేవ చేయించుకొనుటకు శిష్యులపై నగిన అదుపు నుంచుకొనుట. ఈ యదుపు క్రమముగా విపరీతమ్ముగా పరిణమించి శిష్యులను నిర్బంధమునకు గురి గావించును. ఈక్రింది కథవలన నిది బాగా బోధపడును:—

అది వర్షాకాలము. ఒకరోజున ఒక ఎలుగుబంటి నది ఒడ్డున నీరు త్రాగుచుండెను. హఠాత్తుగా పెద్దవరద వచ్చి ఎలుగుబంటి నదిలో కొట్టుకొని పోవుచుండెను. కొంతదూరము పోవునరికి అడవిలో పశువులను మేపుచున్న పశువులకాపర్లు దానిని చూచిరి.

ప్రవాహవేగమువలన ఎలుగుబంటితల, చేతులు, కాళ్ళు మొదలగునవి పైకి కనబడక కేవలము వీపుమాత్రము కాన్పించుచుండెను. పశువుల కాపరులు దానిని జూచి కంబళీలమూట కొట్టుకొని పోవుచున్నట్లు భావించిరి. ఆమూట కాశించి వారిలో నొకడు ఈదుకొని వెళ్లి దానిని పట్టుకొనెను. ఎలుగుబంటి వానిని గట్టిగా పట్టుకొనెను. ఇరువురు మునుగుచు తేలుచు కొట్టుకొనిపోసాగిరి. ఇది చూచి ఒడ్డున ఉన్న పశువుల కాపరులు 'కంబళీలమూటను విడచి రమ్ము' అని కేకలు వేయసాగిరి. వాడు 'నేను దానిని విడచుటకు ఎంత ప్రయత్నించినను అది నన్ను విడువకుండా ఉన్నది' అని పలికెను.

ఇదేవిధముగా ఇప్పటిసన్న్యాసులు దాస్యమునకు శిష్యులను చేరదీయుదురు. శిష్యులు ఆదాస్యమును భరించలేక పోదలచినను గురువులు వారిని గట్టిగాపట్టుకొని పోనియ్యరు. అందుచేత శాస్త్రజ్ఞులు శిష్యులను సంగ్రహించరాదని నిషేధించిరి.

పూజార్థమ్ :— చాలమంది శిష్యులున్నచో గురువుగారిని ఉన్నతాసనముపై కూర్చుండబెట్టి 'నమోఽస్త్వనంతాయ సహస్రమూర్తయే' ఇత్యాదిశ్లోకములతో పుష్పాంజలులను సమర్పించి పూజించుదురు.

యశోర్థంవా :— 50, 60 మంది సన్యాసులే శిష్యులైనచో వారు అపరిమితగౌరవాదరములతో గురువుగారిని సత్కరింతురు. అది చూచి ఆగురువుగారు ఎంతో మహానుభావుడని సామాన్య ప్రజలు అనుకొనెదరు.

ఈ ప్రకారము శుశ్రూషాపూజాప్రతిష్ఠలకొరకు "శిష్యానామనుకారుణ్యాత్" అనగా శిష్యులయందు దయవలన శాస్త్రములనో, యోగములనో అభ్యసింపజేయుటకు చాలకాలమువరకు శిష్యులను తనచెంత నుంచుకొనుట 'శిష్యసంగ్రహము' అనబడును.

'గ్రన్థాన్నైవాభ్యసేద్బహూన్'

సన్యాసులు యోగాభ్యాసకాలమున చాలాగ్రంథముల నభ్యసింపరాదు. పూర్వము ద్విజులుమాత్రము వేదవేదాంగముల నభ్యసించి "ఆశ్రమాదాశ్రమం గచ్ఛేత్" అను శ్రుతి ననుసరించి 75 సంllల తరువాత అంతిమమైన సన్యాసాశ్రమమును స్వీకరించెడివారు. అప్పుడు వారికి వేదశాస్త్రములను అభ్యసించవలసిన అవసరము ఉండెడిది కాదు. ఇప్పుడు అట్లుకాక బాల్యమునందే సన్యాసము తీసికొనుట ప్రాయికమైనది. ఇట్టివారు అన్నపానములు, గౌరవ ప్రతిష్ఠలు, ధనము—వీటిని సంపాదించుటకు విసుగుచెందరు. వారు శాస్త్రాభ్యాసము చేసిన కొలది కఠోరహృదయులగుచున్నారు. కావున ఎక్కువ శాస్త్రాభ్యాసము పనికిరాదని చెప్పబడినది.

వేదాంతమునకు మూలము దశోపనిషత్తులు. అందు ఆత్మ జ్ఞానమునకు వలయు సాధనము లన్నియు లభించును. గీతనుకూడ మననము చేయవలెను. ఇంకా అవసరమైతే షడ్దర్శనములందలి బ్రహ్మసూత్రములను, యోగసూత్రములను, సాంఖ్యసూత్రములను మననము చేయవలెను. న్యాయము, వైశేషికము, మీమాంసా ఇత్యాదులను మననము చేయ నవసరములేదు. అందు అనాత్మవస్తు ప్రతిపాదనము కలదు. పై జెప్పిన గ్రంథములద్వారా జ్ఞానసాధనములను గ్రహించినపిదప ఆగ్రంథములను త్యజింపవలెను. బ్రహ్మ బిందూపనిషత్తునందు ఇట్లు చెప్పబడినది:—

'గ్రన్థమభ్యస్య మేధావీ జ్ఞానవిజ్ఞానతత్పరః।
పలాలమివ ధాన్యార్థీ త్యజేద్గ్రన్థమశేషతః॥'

బియ్యమును కోరువాడు ధాన్యమునందలి ఊక, చిట్టును విడచి బియ్యమును మాత్రమే గ్రహించును. అట్లే బుద్ధిమంతుడు జ్ఞాన విజ్ఞానతత్త్వమును (పరోక్షఅపరోక్షజ్ఞానములను) గ్రంథముల

ద్వారా గ్రహించి అనంతరము గ్రంథములను త్యజించవలెను. ప్రపంచదృష్ట్యా ఈశాస్త్రములు అంతర్ముఖములుగాని స్వరూపదృష్ట్యా అవి బహిర్ముఖములు. కావున శాస్త్రముల నభ్యసించి ఏకాంతమున కూర్చొని యోగాభ్యాసము చేయవలెను.

'న వ్యాఖ్యాముపయుఞ్జీత'

సన్యాసి యోగాభ్యాసకాలమున ఉపన్యాసముల నియ్యరాదు. ఉపన్యాసముల నిచ్చుటకు శ్రుతులు, స్మృతులు, ఇతిహాసములు, పురాణములు మున్నగు గ్రంథములను నిత్యము నవలోకించవలసివచ్చును. తరువాత నెమ్మది నెమ్మదిగా ప్రజలతో సంసర్గమేర్పడును. అంతట ప్రజల మనస్సులను రంజింపజేసి మెప్పు పొందవలెనని కుతూహలము జనించును. క్రమేణ అన్నపానాది భోగవిలాసములలోనికి చిత్తవృత్తి ప్రవేశించి చివరకు వాటిలో నిమగ్నుడగును. ఇట్లు బహిర్ముఖమగువృత్తి కలవానికి జ్ఞానమెట్లు కలుగును?

'నారమ్భానారభేత్ క్వచిత్'

సన్యాసి ఎచ్చటను ఏపనిని ఆరంభించరాదు. మఠము, అన్నసత్రము, పాఠశాల, గోశాల, మందిరము మున్నగువాటిని నిర్మించు ప్రయత్నములను చేయరాదు. మఠాదులను నిర్మించుటకు ద్రవ్యమును సేకరించవలసి యుండును. నిర్మాణానంతరముకూడ వాటి నిర్వహణమునకు ధనమును కూడబెట్టవలసి యుండును. ఇట్టి పనులలో దిగినచో యోగాభ్యాసమునకు తప్పక విఘ్నము కలగును. జాబాలోపనిషత్తునందిట్లు చెప్పబడియున్నది :—

అనికేతవాస్యప్రయత్నో నిర్మమః శుక్లధ్యానపరాయణః

"ఒకచోట నుండరాదు. ప్రయత్నములను చేయరాదు. మమత్వమును వీడి బ్రహ్మధ్యానమున నిమగ్నుడు కావలెను

ఈశరీరమున జ్ఞానసంపాదనద్వారా మోక్షము నొందవలె ననుకొనినచో అన్నివిధములగు సాంసారికప్రవృత్తులను త్యజించి ఏకాంతమున కూర్చొని ధ్యానయోగమును చేయవలెను. సన్యాసమును స్వీకరించిన యనంతరము ప్రవృత్తిమార్గమునకు దిగినచో రెంటికిచెడ్డ రేవడి యగును.

ఇదంతా విని శ్రీప్రకాశానందస్వామివా రిట్లు నుడివిరి:—

*న లోకచిత్తగ్రహణే రతస్య న భోజనాచ్ఛాదనతత్పరస్య,*
*న శబ్దశాస్త్రాభిరతస్య మోక్షో న చాతిరమ్యావసథప్రియస్య॥*

"ఎవని మనస్సు ఇతరుల చిత్తము నాకర్షించుటకు తాపత్రయ పడునో, ఎవడు భోజనవస్త్రాదులయందు ఆసక్తుడై యుండునో, ఎవడు శబ్దశాస్త్రాదులందు నిమగ్నుడగునో, ఎవనికి రమ్యములైన భవనముల యందు ప్రీతియుండునో అట్టివానికి మోక్షము లభించదు."

*న లోకచిత్తగ్రహణే రతస్య:—* జనులకు మనోరంజనము గావించి వారిని వశపరచుకొనవలె నను అభిప్రాయము కలవాడు ప్రజలకు భాగవతమునందు అభిరుచి యున్నచో భాగవత కాలక్షేపము చేయును. వారు కృష్ణోపాసకులైనచో కృష్ణభగవానుడే షోడశకళాపరిపూర్ణు డనియు, పూర్ణపురుషోత్తము డనియు ప్రతిపాదించును. ప్రజలకు రామాయణమందు మక్కువ యున్నచో రామాయణము వినిపించును. వారు రామోపాసకులైనచో రాముని పితాజ్ఞాపరిపాలనము, ఏకపత్నీవ్రతత్వము మున్నగు సద్గుణములను ప్రతిపాదించును. ఈవిధముగా ప్రజల మనస్సును రంజింపజేసి వారిధనమును కొల్లగొట్టి తన తెలివితేటలను చెప్పుకొనును. ఇట్టివారిని గూర్చి తులసీదాసు ఇట్లు చెప్పెను:—

తులసీ సోయి చతురతా రామభజనమే లీస్,
పరమన్ పరధన్ హారనకో వేశ్యా బడీ ప్రవీన్.

"తులసీ! రామభజనలో నిమగ్నత చెందుటయే చాతుర్యము. పరుల మనస్సును పరుల ధనమును ఆకర్షించుటలో చాతుర్యము వేశ్యకు మరీ ఎక్కువ."

*న భోజనాచ్ఛాదనతత్పరస్య* :– దేవాలయములలో నిత్యము బాలభోగము, రాజభోగము మున్నగుపేర్లతో అనేకవిధములైన పిండివంటలు నైవేద్యమునకు సిద్ధము చేయుదురు. ఇప్పటి సన్యాసులుకూడ అట్లే రకరకాల ఆహారపానీయాదులను సిద్ధము చేయించుకొని అనుభవించుదురు. అటులనే పట్టువస్త్రములను మంచిశాలువలను ధరించుదురు.

*న శబ్దశాస్త్రాభిరతస్య* :– వివిధదేశములందలి విద్వాంసులతో శాస్త్రార్థము చేయుటలో తమకు ఓటమి కలుగకుండుటకున్ను, వాదపటిమకున్ను అనాత్మప్రతిపాదకములగు వ్యాకరణాదిశాస్త్రముల నభ్యసించుటయందు ఈ సన్యాసులు నిమగ్నులగుచున్నారు.

*న చాతిరమ్యావసథప్రియస్య* :– అత్యంత సుందరములైన భవనములందు నివసింపగోరి సన్యాసులు చలునరాతితో కట్టబడిన సౌధములను, విలువైన ఆసనవాహనాదులను సమకూర్చుకొనెదరు. ఇట్టివారికెల్ల మోక్షము లభించదు. కావున సన్యాసి అన్నపానాదులయందు సాత్త్వికప్రవృత్తిని కలిగియుండవలెను.

## వైరాగ్యమునకు నాంది

ఈవిషయమున 'పారసభాగము'న ఇట్లు వ్రాయబడినది. కందమూలములతో ఉదరపోషణము జరుగును. అన్నము రాజస పదార్థము. తాను తిను ఆహారమువలన పూర్తితృప్తి కలుగరాదు. ఆకలిని కలిగి యుండరాదు. నియతాహారుడు కావలెను. ఆశలేకుండుట వైరాగ్యమునకు మూలము. ఆశాపరుడు వైరాగ్యమును సాధించలేడు. విరక్తుడు ఒకే జత దుస్తులను కలిగియుండును. రంగు

రంగులుగల మృదువైన వస్త్రములు ధరించువానికి వైరాగ్యము కలుగదు. 'యహియా' అను సంతు గోనెసంచులను ధరించెడివాడు. ఆతనితల్లి కోమలవస్త్రముల నాతనిచే ధరింపజేసెను. అంతట ఆకాశ వాణి వినిపించెను. "యహియా, నన్ను త్యజించి భోగముల నంగీ కరించితివి." ఇది విని ఆయన ఆవస్త్రములను విడచి మామూలు గోనెసంచుల బట్టలను ధరించెను.

త్యాగము ఎంత ఎక్కువగా ఉన్న అంత ఎక్కువ లాభము. జిజ్ఞాసువు ఒకచోట స్థిరముగా నుండరాదు. నివసించుటకు స్థాన మేర్పరచుకొని దానిని అలంకరించినవాడు విరాగి కాడు. శీతోష్ణా దులనుండి రక్షించుటయే నివాసస్థానపు ప్రయోజనము. నశ్వరము కాని గృహమునందు ప్రేమకలిగియుండుట ఉత్తమము.

ఉత్తముడైన విరక్తుడు ఎట్టి సామగ్రిని సేకరించడు. 'ఇసా' అను మహాపురుషు డొకడు క్రమేణ సర్వసామగ్రిపరిత్యాగము చేసియు త్రాగుటకు చెంబును, తల దువ్వుకొనుటకు దువ్వెనను తన చెంత నుంచుకొనెను. ఆతడొకనాడు ఒకపురుషుని, చేతితో నీళ్ళు త్రాగి చేతితోనే తలదువ్వుకొనుచుండగా, చూచెను. వెంటనే తన చెంతనున్న చెంబు, దువ్వెన తనకేల యని వాటినికూడ విసర్జించెను.

అనంతరము శ్రీనిత్యానందస్వామివారివైపు చూచి శ్రీ ప్రకాశానందస్వామివారిట్లు పలికిరి— "నేను తమయెదుట నేను చాలా ఎక్కువగా మాట్లాడితిని. ఎక్కువ మాట్లాడినప్పుడు నావృత్తి బహి ర్ముఖ మగును." ఇది విని శ్రీనిత్యానందస్వామివారు ఇట్లు నుడివిరి:—

**ఎక్కువ మాట్లాడినను, వినినను, వృత్తి బహిర్గతమగును.**

*యోగస్య ప్రథమద్వారం వాఙ్నిరోధో ఽపరిగ్రహః ।*
*నిరాశా చ నిరీహా చ నిత్యమేకాన్తశీలతా ॥*

"వాఙ్నిరోధము, అపరిగ్రహము, ఆశారాహిత్యము, అనాసక్తి, ఏకాంతమునందుండు స్వభావము— ఇవి అన్నియు యోగమునకు ప్రథమద్వారము."

వాఙ్నిరోధః :—యోగాభ్యాసి మౌనముగా నుండవలెను. మితభాషిత్వము 'మౌన' మనబడును.

*అపరిగ్రహః* :—భోగవిలాసములకు సాధనములైన ధనాదిమాయాజన్యపదార్థములను సంగ్రహించరాదు.

*నిరాశా* :—విషయపరిచకమునకు సంబంధించిన భోగకాంక్షను విసర్జించవలయును.

*నిరీహా*:—ప్రాణధారణమునకుతప్ప యోగమార్గమునకు విఘ్నములను కలిగించు అనాత్మక్రియలను చేయుటయందు ఆసక్తి ఉండరాదు.

*నిత్యమేకాన్తశీలతా*:—వనము, గుహ మొదలగు జనసమూహమునకుదూరముగానున్న ఏకాంతస్థలములందు నిత్యము నివసించవలెను.

ఇవి అన్నియు యోగమునకు ప్రథమద్వారము. యోగమనగా చిత్తమును బ్రహ్మతో నేకీభవింపజేయుట.

శ్రీప్రకాశానందస్వామివారు చెప్పినది యథార్థము. ఎక్కువగా మాట్లాడుటవలనను, వినుటవలనను వృత్తి బహిర్ముఖ మగును. మాకుగూడ ఇట్టి అనుభవము కలదు.

తరువాత శ్రీప్రకాశానందస్వామివారు గ్రామమునకు బయట నున్న శివాలయమునకు వెళ్ళి ఆరాత్రి అచ్చటనే గడపిరి.